ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



కాకినాడ

జిల్లా వార్తలు

గురువారం 27 జూన్ 2024 | 3

రెండురోజులపాటు మంత్రి నాదెండ్ల పర్యటన -5లో

చెత్తకుప్పల్లో ఆధార్ కార్డులు -5లో

కాకినాడలో ఎన్‌ఎఫ్‌సీఎల్ ఉద్యోగుల ఆందోళన -మెయిన్‌లో



గ్రామ పంచాయతీలు..

బలోపేతమయ్యేనా?



గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైసీపీ ప్రభుత్వం నాశనం చేసింది. పంచాయతీల అధికారాలకు కత్తెర వేస్తూ దీనికి సమాంతరంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. విధులు, నిధులు కేటాయించకుండా పంచాయతీలను బలహీనపరిచింది. దీనివల్ల పల్లెల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. డయేరియా వంటి వ్యాధులు ప్రబలి ప్రజారోగ్యం దెబ్బతింటోంది. ప్రస్తుతం పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్నందున పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి శూన్యం
- తాండవిస్తున్న అపారిశుధ్యం
- జిల్లావ్యాప్తంగా పల్లెల్లో విస్తరిస్తున్న వ్యాధులు
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా పవన్ రాకతో పంచాయతీ వ్యవస్థ బలోపేతంపై ప్రజల్లో చిగురిస్తున్న ఆశలు

సర్పవరం జంక్షన్, జూన్ 26: నిధులు, విధులకోసం రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు పలు పోరాటాలు చేసినా అప్పటి సీఎం జగన్ ఉక్కుపాదంతో అణచివేయడంతో సర్పంచ్‌లంతా చేసేదేమీలేక మిన్నకుండిపోయారు. సార్వత్రిక ఎన్నికల్లో సర్పంచ్‌లంతా సంఘటితంగా వైసీపీకి వ్యతిరేకంగా పనిచేసి కూటమి గెలుపులో భాగస్వాములయ్యారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు తీసుకోవడంతో పంచాయతీ వ్యవస్థ బలోపేతం అవుతుందని సర్పంచ్‌లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాడే పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన చేసుకోవడంతో పంచాయతీలకు విధులు, నిధుల మంజూరుపైనే సర్పంచ్‌లు ఆశలు పెట్టుకున్నారు.

ఆర్థిక సంఘాల నిధులు దారి మళ్లింపు

కాకినాడ జిల్లాలో 385 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో 2022-23 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నుంచి తొలి విడతలో రూ.12.57కోట్లు, రెండో విడతలో రూ.26.75కోట్లను కేంద్ర ప్రభుత్వం నిధులను పంచాయతీలకు విడుదల చేసింది. జగన్ ప్రభుత్వం ఈ నిధులను పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా దారి మళ్లించింది. ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం పీడీ ఖాతాలకు మళ్లించేసింది. ఈ విషయమై సర్పంచ్‌లు పలుసార్లు ఆందోళన చేసినా లెక్కపెట్టలేదు సరికదా ఉక్కుపాదంతో అణచివేసింది. సచివాలయాల నిర్వహణకు అయ్యే ఖర్చును స్థానిక సంస్థలనుంచి వసూలు చేసి పంచాయతీలపై మరింత ఆర్థికభారాన్ని మోపింది. దీంతో పంచాయతీలకు ఆదాయం లేక, సిబ్బందికి జీతాలు ఇవ్వలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో కనీస అవసరాలైన తాగునీరు, శానిటేషన్, విద్యుత్తు తదితర అవసరాలను తీర్చలేని స్థితికి పంచాయతీలు దిగజారాయి. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ప్రభుత్వం తుంగలో తొక్కేసింది. ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను పట్టించుకోలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి తొలి విడతలో రూ.27.02కోట్లు రాగా అరకొరగా పారదర్శకత లేకుండా కొద్దిగా నిధులు ఇచ్చి మిగతావి ప్రభుత్వం వాడేసుకుంది. రెండో విడత ఆర్థిక సంఘం నిధులు మార్చిలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినా వీటినీ నేటికీ పంచాయతీ ఖాతాలకు జమ చేయలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ నిధులపైనే సర్పంచ్‌లు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. గ్రామాల్లో ఎక్కడికక్కడే సమస్యల తిష్టవేశాయని, కనీస అవసరాలు తీర్చడంలో విఫలం చెందుతున్నామని, ఈ నిధులు వస్తే తాగునీటి పథకాల నిర్వహణ, శానిటేషన్, విద్యుత్ దీపాల నిర్వహణ, మరమ్మతులు, ప్రజారోగ్యం కోసం నిధులు వెచ్చించే వెసులుబాటు ఉంటుందని సర్పంచ్‌లు అభిప్రాయపడుతున్నారు.

రూ.100కోట్ల స్టాంప్ డ్యూటీ లూటీ

జిల్లాలో ఉన్న ఎన్నికలు జరిగిన గ్రామ పంచాయతీలకు స్టాంప్ డ్యూటీ కింద రూ.100కోట్ల మేర రావాల్సి ఉందని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. గ్రామాల్లో జరిగే భూమి క్రయ, విక్రయాల ద్వారా పంచాయతీలకు స్టాంప్ డ్యూటీ ద్వారా ఆదాయం లభిస్తుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు స్టాంప్ డ్యూటీ విడుదల సక్రమంగా జరిగేదని, ఏడాదికి పంచాయతీ స్థాయిని బట్టి రూ.25లక్షల నుంచి రూ.కోటి వరకు స్టాంప్ డ్యూటీల కింద నిధులు వచ్చేవంటున్నారు. సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఏడాది సక్రమంగా ఈ నిధులను జమ చేయలేదన్నారు. అసలు స్టాంప్ డ్యూటీ ఎంత రావాలి, ఎంత చెల్లించారు అనేది పారదర్శకత లేకుండా ప్రభుత్వం వ్యవహరించిందని ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.100కోట్ల స్టాంప్ డ్యూటీ కింద నిధులు రావాల్సి ఉందని, ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ప్రభుత్వం లూటీ చేసిందని సర్పంచ్‌లు ఆరోపించారు. కేంద్రం ఇచ్చే నిధులు ఇవ్వకుండా చేయడం, స్టాంప్ డ్యూటీ నిధులను సైతం ఇవ్వకుండా దారి మళ్లించి పల్లెల ప్రగతిని ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. కేంద్రం నుంచి నేరుగా పంచాయతీలకు నిధులు జమ చేసేందుకు వీలుగా ఈ గ్రామ స్వరాజ్య పథకం కింద బ్యాంకు ఖాతాలను ప్రారంభించాలని, దీని నిర్వహణ గ్రామ సెక్రటరీ, సర్పంచ్‌ల ఇద్దరి డిజిటల్ సిగ్నేచర్‌తో నిర్వహించాలని చెప్పిందన్నారు. దీనివల్ల కేంద్రం నిధులు సీఎఫ్ఎంఎఫ్ అకౌంట్‌లోకి వెళ్లకుండా ఈగ్రామ స్వరాజ్ అకౌంట్‌లోకి జమవుతాయన్నారు. దీన్ని పంచాయతీరాజ్‌శాఖమంత్రి పవన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయాలి

నక్కా వీరన్న, రేపూరు గ్రామ సర్పంచ్

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, సర్పంచ్‌లకు విధులు, నిధులు వచ్చేలా మంత్రి పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకోవాలి. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది. స్థానిక సంస్థల అధికారాలను హరించివేసింది. ఉత్సవ విగ్రహాల్లాగా మారాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మంత్రిగా పవన్ బాధ్యతలు స్వీకరించడంతో పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తాయనే నమ్మకంతో ఉన్నాం. కేంద్రం నిధులన్నీ నేరుగా ఈ గ్రామ స్వరాజ్య ఖాతాలోకి జమ చేసేలా చర్యలు తీసుకోవాలి. సచివాలయ వ్యవస్థను పంచాయతీల పరిధిలోకి తీసుకువచ్చేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కృషి చేయాలి.

సామర్లకోటలో

మరో మూడు డయేరియా కేసులు



సామర్లకోట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

సామర్లకోట, జూన్ 26: సామర్లకోట పట్టణంలో బుధవారం విరేచనాలతో డయేరియా బారిన పడి అస్వస్థతతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మరో ముగ్గురు బాధితులు చికిత్స నిమిత్తం చేరారు. వీరిలో సామర్లకోట పట్టణానికి చెందిన ఇద్దరు కాగా మండలంలోని గొంచాలకు చెందిన ఒకరు ఉన్నారు. సామర్లకోట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో స్థానిక బ్రౌన్‌పేటకు చెందిన గొల్లపల్లి రాజు, కుమ్మరి వీధి చెందిన కాకరపల్లి శ్రీరామ్మూర్తి, గొంచాలకు చెందిన ఎం.యశ్వంత్ ఉన్నారు. గత శనివారంనుంచి సామర్లకోట మండలంలోని వేట్లపాలెంలో డయేరియా బారిన పడి 30మంది వ్యక్తులు చికిత్సలు పొందగా వారిలో ఒక మహిళ మృతి చెందిన విషయం విదితమే. దీంతో వేట్లపాలెంలో డయేరియా అదుపులోకి తీసుకొచ్చేందుకు పలు శాఖల అధికారులు అహరహం శ్రమిస్తున్నారు. మరోపక్క ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ఉన్నతస్థాయి చికిత్సలు అందేలా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప రెండురోజులుగా గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించి మానసిక ధైర్యం ఇవ్వడమేగాక మెరుగైన వైద్యం అందేలా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం నాటికి వేట్లపాలెం గ్రామంలో డయేరియా అదుపులోకి వచ్చింది అనుకుంటున్న అధికారులకు బుధవారం సామర్లకోటలో డయేరియా కేసులు నమోదు కావడంతో బెంబేలెత్తుతున్నారు. సామర్లకోట పట్టణంలో పారిశుధ్య పరిస్థితులపై ప్రజలు, మానవ హక్కుల పరిరక్షణ సంఘ ప్రతినిధులే కాకుండా సాక్షాత్తూ ఎమ్మెల్యే చినరాజప్ప సైతం మున్సిపల్ అధికారులను హెచ్చరించినా అధికారులు బేఖాతరు చేశారన్న ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. 15రోజులుగా మున్సిపల్ కుళాయిల నుంచి పసరు రంగులో తాగునీరు సరఫరా అవుతోందని ప్రజలు మొత్తుకున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోలేకపోవడం వల్లే నీరు కలుషితమై డయేరియా వ్యాప్తికి మున్సిపల్ అధికారులు కారణమయ్యారన్న ఆరోపణలు ప్రజలనుంచి వినవస్తున్నాయి. తాగునీరు సరఫరా చేసే వేసవి జలాశయంలో చేపలవేట సాగిస్తుండడం, జలాశయంలోని నీటి నిల్వలు బురదగా మారిపోవడం వల్ల క్లోరినేషన్ చర్యలు లోపించాయని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా పట్టణంలో డయేరియా వ్యాప్తి చెందడంపై ఎమ్మెల్యే చినరాజప్పకు సమాచారం అందడంతో మున్సిపల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులను, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు.

డయేరియా నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలి: కలెక్టర్



కాకినాడ కలెక్టరేట్‌లో స్టాప్ డయేరియా గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 26: జిల్లాలో డయేరియా వ్యాధి నియంత్రణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్యం, జీజీహెచ్, జడ్పీ, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం, సాంఘిక సంక్షేమం, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని పంచాయతీ, మున్సిపాలిటీలతోపాటు అంగన్‌వాడీ, వసతిగృహాలు, పాఠశాలల్లో డయేరియా వ్యాధి నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే జిల్లాలో కొమానపల్లి, బెండపూడి, వేట్లపాలెం గ్రామాల్లో డయేరియా కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ప్రాంతాల్లో డయేరియా వ్యాధి ప్రబలడానికి కారణమైన అంశాలను సేకరించిన తాగునీరు ఇతర నమూనాల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా కాచి చల్లార్చిన వేడినీళ్ల తీసుకునేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ అన్ని ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. మరోసారి అన్నిప్రాంతాల్లో తాగునీరు పైపులైన్ల తనిఖీ చేసి లికేజీ మరమ్మతుల వివరాలు సమర్పించాలన్నారు. జూలై 5వతేదీ నాటికి ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీకేంద్రాల్లో తాగునీటి పరీక్షలు నిర్వహించాలన్నారు. జూన్ 30వతేదీ నాటికి అన్ని ఇనిస్టిట్యూషన్స్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్స్ పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో మంచినీరు ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనంతరం స్టాప్ డయేరియా కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతికను ఆయన జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు. సమావేశంలో జిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారి నరసింహనాయక్, డీఐవో రత్నకుమార్, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్య, డీఈవో రమేష్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసు, డీపీవో భారతి సౌజన్య, జిల్లా పౌరసంబంధాలశాఖ డీడీ నాగార్జున, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రమణమూర్తి, ప్రవీణ, లల్లి పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా..

మహిళలను అప్రమత్తం చేయాలి: డీఆర్‌డీఏ పీడీ

సామర్లకోట, జూన్ 26: జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వ్యాప్తి చెందుతున్న డయేరియాపట్ల గ్రామాల్లో మహిళలను అప్రమత్తం చేయాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి అన్నారు. సామర్లకోట టీటీడీసీ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాఖ్య 15వ సమావేశం బుధవారం జిల్లా సమాఖ్యల ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీడీ శ్రీరమణి మాట్లాడుతూ డయేరియా వ్యాప్తికిగల కారణాలు, వ్యాప్తి కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు వంటి అంశాలపై జిల్లా సమాఖ్యల ప్రతినిధులు మండల సమాఖ్యలకు, వారు గ్రామ వీవోలకు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం రూపొందించేందుకు మహిళా సమాఖ్యలు కృషి చేయాలన్నారు. అనంతరం డాక్టర్ భవ్యశ్రీ మాట్లాడుతూ వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన వారు తక్షణం సమీపంలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి చేరుకుని చికిత్సలు పొందాలన్నారు. నిల్వఉన్న ఆహారాన్ని ఎంత మాత్రం భుజించరాదన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఈగలు, దోమలు వాలకుండా నిరోధించే చర్యలు చేయడమేగాక పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డయేరియా వ్యాప్తినుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. సమావేశంలో డీపీఎంలు, ఏపీఎంలు, వీవోలు పాల్గొన్నారు.

వైరల్ జ్వరాలు.. కడుపు నొప్పి, విరోచనాలతో సతమతం



కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీలో మురుగుకాలువలో తీసిన చెత్త

- కొత్తపల్లి మండలంలో వందల సంఖ్యలో బాధితులు

కొత్తపల్లి, జూన్ 26: కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో ప్రజలు వైరల్ జ్వరాలు, కడుపునొప్పి, విరోచనాలతో ఇబ్బందులకు గురవుతున్నారు. వాతావరణంలో మార్పులు రావడంతో తాగేనీరు, తినే తిండిని బట్టి అంటురోగాలతో ప్రజలు సతమతమవుతున్నారు. మూడురోజులుగా కొత్తపల్లి పీహెచ్‌సీ పరిధిలో 100 నుంచి 150 మంది ప్రజలు వైరల్ జ్వరాలకు చికిత్సలు పొందుతున్నారు. ఉప్పాడ తీరప్రాంతాలకు చెందిన పలువురు కడుపునొప్పి, విరోచనాలతో బాధపడుతున్నారు. వీరంతా ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తీరప్రాంత గ్రామాల్లో పారిశుధ్య లోపాలు ఉండడం, మంచినీటి కుళాయిలు మురుగుకాలువల్లో ఉండడం, తద్వారా పైప్‌లైన్ లీకై కలుషిత నీరు తాగడం వంటి కారణాలతో ప్రజలు కడుపు నొప్పి, విరోచనాలతో బాధపడుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సత్వరంగా వైద్యసేవలందిస్తున్నామని కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్ చోడిశెట్టి శుష్మ తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న 11 సబ్‌సెంటర్ల పరిధిల్లో ఆరోగ్యకార్యకర్తలు ప్రజలఆరోగ్యంపై వివరాలు సేకరిస్తున్నారని ఆమె చెప్పారు. ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. వైరల్ జ్వరాల బారిన పడకుండా ప్రజలు కాచిచల్లార్చిన మంచి నీటిని తాగాలన్నారు. వేడి ఆహారపదార్థాలను భుజించాలన్నారు.

ఇద్దరు పిల్లల తల్లిని మింగిన డయేరియా

- పేద బతుకుల్లో పెనువిషాదం



మృతురాలి కుమార్తెలు లక్ష్మీపావని, ధనేశ్వరి

తొండంగి, జూన్ 26: పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా జడలు విప్పిన డయేరియా భూతం ఆ పేద కుటుంబంలో చిచ్చురేపి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. తొండంగి మండలం కొమ్మనాపల్లిలో ఈనెల 14న మృతిచెందిన దొడ్డి నాగమణికి భర్తతోపాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ చిన్నారుల్లో ఒకరికి ఆరేళ్లు కాగా మరో పాపకి ఏడాదిన్నర. గ్రామంలో డయేరియా వ్యాప్తి చెందడంతో నాగమణి దానికి బలయ్యింది. ముందుగా ఇద్దరు పిల్లలకు, భర్తకు డయేరియా సోకింది. వారికి నాగమణి సపర్యలు చేయడం.. వైద్యసహాయం అందడంతో వారు కోలుకున్నారు. ఆమెకు కూడా డయేరియా బారిన పడింది. 13వ తేదీ రాత్రి నుంచి వాంతులు కావడంతో ఆమెను వైద్యం కోసం వేరే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఊపిరి ఆగింది. ఆమె కుటుంబం అమ్మగారి ఊరైన కొమ్మనాపల్లిలో నివాసముంటున్నారు. ఆమె అత్త వారిది ఉప్పాడ కొత్తపల్లి మండలం రమణక్కపేట. అక్కడ కర్మకాండలు ముగిశాక బుధవారం తిరిగి కుటుంబసభ్యులు కొమ్మనాపల్లికి చేరుకున్నారు. తల్లిలేని విషయం పూర్తిగా అవగాహనకు రాని చిన్నారులిద్దరూ అమ్మమ్మ ఇంట్లో బిక్కుబిక్కుమంటూ ఉండడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. చెల్లి ధనేశ్వరికి తానే పెద్దదిక్కై ఆడిస్తూ పెద్దపాప లక్ష్మీపావని అక్కున చేర్చుకుంటోంది. అమ్మమ్మ, తాతయ్యలది పెద్ద వయస్సు కావడంతో కూలి, నాలి చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పిల్లల తండ్రి అమాయకుడు కావడంతో పిల్లల భవిష్యత్తుపై నీలినీడలు అలుముకున్నాయి. ఇద్దరూ ఆడపిల్లలు అవడం వల్ల వారి ఆలనాపాలనా చూసే నాథుడు ఎవరంటూ బంధువులు ఆందోళన చెందుతున్నారు.

ఎమ్మెల్యే సత్యప్రభకు అపూర్వ స్వాగతం -5లో



ప్రత్తిపాడులో ర్యాలీగా వస్తున్న సత్యప్రభకు గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

డ్రగ్స్, మద్యానికి దూరంగా ఉందాం -5లో

- అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

బిల్లుల పేరుతో అధికారుల మాయాజాలం -5లో

కలెక్టర్‌ను కలిసిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు మొక్క అందజేస్తున్న కొండబాబు

కాకినాడ సిటీ, జూన్ 26: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సగిలి షణ్మోహన్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కాకినాడ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యే కొండబాబు వివరించారు. పెండింగ్ పనులు తదితర అంశాలపై కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా సమీక్ష జరిపి అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని కోరారు.

పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో

70.12 శాతం ఉత్తీర్ణత

కాకినాడరూరల్, జూన్ 26: గతనెల 24 నుంచి ఈనెల 10వతేదీ వరకూ నిర్వహించిన పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో కాకినాడ జిల్లా 15వ స్థానంలో నిలిచినట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. పరీక్షలకు జిల్లాలో 5,851మంది విద్యార్థులు హాజరుకాగా 4,103 మంది ఉత్తీర్ణులవగా 1748మంది పాస్‌కాలేదన్నారు. జిల్లాలో మొత్తం 70.12 ఉత్తీర్ణతా శాతం నమోదవగా బాలికలు 72.76శాతం, బాలురు 68.23శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో

జిల్లాలో 36శాతం ఉత్తీర్ణత

కాకినాడ రూరల్, జూన్ 26: ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం ప్రకటించిన ఇంటర్ ప్రథమ సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాల్లో జిల్లాలో 36శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. ఈ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1 వరకూ జరిగాయన్నారు. జిల్లాలో జనరల్ కేటగిరీలో 6704 మంది విద్యార్థులు హాజరు కాగా 2417మంది ఉత్తీర్ణత చెందగా 4287మంది పాస్ కాలేదు. ఒకేషనల్ కేటగిరీలో 579మంది హాజరుకాగా 272మంది ఉత్తీర్ణత చెందగా 307మంది పాస్ కాలేదని తెలిపారు. జనరల్ కేటగిరీ ఫలితాల్లో జిల్లా 23వ స్థానంలోనూ, ఒకేషనల్ కేటగిరీలో 47శాతం ఉత్తీర్ణతతో 17వ స్థానంలోనూ నిలిచింది.

పాఠశాలల్లో విద్యాప్రణాళికను తప్పనిసరిగా పాటించాలి: డీఈవో



విద్యార్థులతో పాఠ్యపుస్తకాలు చదివిస్తున్న డీఈవో పిల్లి రమేష్

కాకినాడ రూరల్, జూన్ 26: జిల్లాలోని పాఠశాలల్లో విద్యాప్రణాళికను తప్పనిసరిగా పాటించాలని, ముఖ గుర్తింపు హాజరును ప్రతిఒక్కరూ వేయాలని డీఈవో పిల్లి రమేష్ సూచించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, ఉపాధ్యాయుల బోధనా విధానం, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పరిశీలనకోసం కాకినాడ పీఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు డీఈవో పలు సూచనలు చేశారు.



ఎగసిపడుతున్న అగ్నికీలలు(ఫైల్‌ఫోటో)



పైపులైన్ పేలడంతో ఏర్పడిన గొయ్యి

గెయిల్ పైపులైన్ పేలుడు జరిగి నేటికి పదేళ్లు

బాధిత కుటుంబాలకు నేటికీ పూర్తిస్థాయిలో జరగని న్యాయం

మామిడికుదురు, జూన్ 26: 2014 జూన్ 27. ఆ రోజు తెల్లావారుజామున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామంలో భారీ విస్ఫోటనం సంభవించింది. ఏమి జరిగిందో తెలిసే లోపలే 22 మంది సజీవదహనమయ్యారు. గెయిల్ సంస్థకు చెందిన ట్రంక్ పైపులైన్ పేలడంతో ఒక్కసారిగా అగ్నికీలలు చుట్టిముట్టి 22 మందిని పొట్టన పెట్టుకోవడమే గాక పలువురిని గాయాలపాల్జేసింది. ఈ దుర్ఘటన జరిగి నేటికి పదేళ్లు పూర్తవుతోంది. ఆనాటి విషాదాన్ని గుర్తుచేసుకుంటూ నగరం గ్రామవాసులు భయాందోళనకు గురవుతున్నారు. గెయిల్ పైపులైన్ విస్ఫోటనం తర్వాత అప్పట్లో ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని బాధితులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నగరం గ్రామాన్ని దత్తత తీసుకుని సకల సౌకర్యాలు కల్పించి మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, ఇంటింటికీ తాగునీరు, వంట గ్యాస్ ఉచితంగా ఇస్తామని.. ఇలా పదుల సంఖ్యలో ఇచ్చిన హామీలు పదేళ్లు కావస్తున్నా అమలు కాలేదని ఈ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గెయిల్ సంస్థ నుంచి నిధులు రాబట్టేలా చర్యలు తీసుకోవాలని నగరం దీవి ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సాహితీవేత్త 'రేకపల్లి' కన్నుమూత



రేకపల్లి శ్రీనివాసమూర్తి

అమలాపురం టౌన్, జూన్ 26: సీనియర్ న్యాయవాదిగా సేవలు అందిస్తూనే సంగీత, సాహిత్య రంగాలకు ఎనలేని సేవలు అందించిన రేకపల్లి శ్రీనివాసమూర్తి (81) బుధవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. వృద్ధాప్యంతో పాటు కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. సంగీతంపై ఉన్న మక్కువతో శ్రీభారతి గానసభను స్థాపించడమే కాకుండా మంగళంపల్లి బాలమురళీకృష్ణ, చిట్టిబాబు వంటి మహామహులతో అమలాపురంలో సంగీత కచేరీలు నిర్వహించారు. సాహితీ రంగంపై మక్కువతో సాహితీ మిత్రమండలిని స్థాపించి యర్రాప్రగడ రామకృష్ణ, పోచినపెద్ది కామసత్యనారాయణ వంటి ప్రముఖులెందరినో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడిగా, ఆలిండియా రేడియో ఆర్టిస్టుగా, సంస్కార భారతి పూర్వ అధ్యక్షుడిగా... విశేష సేవలు అందించారు. ఎందరినో కవులుగా తీర్చిదిద్ది మరెందరినో ప్రోత్సహించారు. శ్రీనివాసమూర్తికి భార్య మహాలక్ష్మి, కుమార్తె ఫణి, కుమారుడు కృష్ణ ఉన్నారు. పిల్లలిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. ఈశ్వరునిపై ఎనలేని భక్తితో 70కు పైగా భక్తి శతకాలను రాసిన ఘనత రేకపల్లికే దక్కుతుంది. రేకపల్లి మృతి సంగీత, సాహితీ రంగాలకు తీరని లోటని డాక్టర్ గోదశి గంగరాజు, డాక్టర్ కొప్పిసీడి వెంకటరమణకుమార్, బులుసు జగదీష్, కాంబాబు, పుత్సా కృష్ణ కామేశ్వర్, నల్లా నరసింహమూర్తి, మాడా రాము, జాన మల్లికార్జునరావు నివాళులర్పించారు.

ఎనీమియా ముక్త భారత్ అమలుపై కేంద్ర బృందం ఆరా

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 26 :జిల్లాలో ఎనీమియా ముక్త భారత్ అమలుపై కేంద్ర బృందం సభ్యులు జితేంద్ర సింగ్, ఎస్ పూజ క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. బుధవారం జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొమ్మూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన సమీక్షలో జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరావు మాట్లాడారు. రక్తహీనత నివారణే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు బలవర్ధకమైన ఆహారం అంటే ఆకుకూరలు, కాయగూరలు, బెల్లం, పప్పు దినుసులు వంటివి తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరిగి తద్వారా రక్తహీనత అధిగమించవచ్చునని తెలిపారు. జిల్లాలో కేంద్ర బృందం సభ్యులు జితేంద్ర సింగ్, ఎస్.పూజ పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోను, అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలన చేసి అక్కడ పిల్లలకు అందించే ఐరన్ పోలిక్ యాసిడ్ గురించి ఆరా తీశారు. అంగన్వాడీ సెంటర్‌లో ఐదేళ్ల లోపు పిల్లలకు వారానికి రెండు సార్లు ఇచ్చే ఐఎఫ్ఏ సిరప్‌లు గురించి తెలుసుకున్నారు. అదే విధంగా శాటిలైట్ సిటీ-3 లో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ లో, అంగన్వాడీలో అమలవుతున్న కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎన్.రాజకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మౌనిక ,బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరి చంద్ర ప్రసాద్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పవన్ దృష్టికి సమస్యలు తీసుకెళ్తాం'

రంపచోడవరం, జూన్ 26: గిరిజన గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని గురుకుల విద్యాలయాల నాన్ టీచింగ్ యూనియన్ నాయకుడు మాదే రామచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి జూలై 1 నుంచి 3వ తేదీ వరకు పిఠాపురంలో అందుబాటులో ఉంటారని వారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలన్నారు. 010 పద్దును 10వ షెడ్యూల్లో ఉన్న గిరిజన గురుకులం, గురుకులాలకు వర్తింపజేయాలని, గురుకుల విద్యాలయాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్, గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ జూనియర్ లెక్చరర్లకు జీతాల పెంపుదల తదితర సమస్యలు రాష్ట్ర అధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు సూర్యారావు ఆధ్వర్యంలో విన్నవించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

ద్రాక్షారామ భీమేశ్వర ఆలయంలో అవినీతిపై

విజిలెన్స్ విచారణ



బహిరంగ విచారణ నిర్వహిస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూన్ 26: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జరిగిన అవినీతి కార్యకలాపాలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ప్రకటించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద బుధవారం అవినీతి ఆరోపణలకు సంబంధించి బహిరంగ విచారణ జరిగిది. ఆలయ ఈవో పి.టి.వి సత్యనారాయణ సమక్షంలో నిర్వహించిన బహిరంగ విచారణలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

- మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటన
- ఆలయం వద్ద మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ
- మాజీ మంత్రి వేణు హయాంలో జరిగిన అవకతవకలను వివరించిన పలువురు భక్తులు
- చందాలతో రథం తయారీ.. కానీ శిలాఫలకంపై మాజీ మంత్రి వేణు పేరు..

భక్తులు చందాలు ఏమైనట్లు?

భీమేశ్వర స్వామివారి రథం తయారీపై వచ్చిన ఆరోపణలపై విచారించారు. రథం తయారీకి అర్చకులు రూ.30 లక్షలు వరకు భక్తుల నుంచి చందాలు వసూలు చేసి ఇచ్చినట్లు తెలపగా మాజీ మంత్రి వేణు రథం తయారు చేయించినట్లు శిలాఫలకం వేయడం, తదుపరి భక్తులు గొడవ చేయగా శిలాఫలకం మార్చి మరో శిలాఫలకం పెట్టడంపై మంత్రి సుభాష్ ఈవోను నిలదీశారు. భక్తుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు భక్తులు చెప్పారు.

మాజీ మంత్రి ఇంటికి ఆలయం నుంచి ఆహార పదార్థాలు

మాజీ మంత్రి వేణు ఇంటిలో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా ఆలయం నుంచి ఆహారపదార్థాలు వండి పంపించారన్న ఆరోపణలపై ఆలయంలో వంటమనిషిని పిలిపించి మాట్లాడారు. వంటలు చేసే రాఘవేంద్రస్వామి చాలాసార్లు వంటలు వండి పంపించామని మంత్రి సుభాష్ ఎదుట తేల్చిచెప్పారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో షాపుల యజమానుల వద్ద లీజు పొడిగింపునకు షాపుకు రూ.5 వేలు చొప్పున వసూలు చేసినట్లు షాపుల యజమానులు మంత్రి ఎదుట స్పష్టం చేశారు. అలాగే ఆలయంలో పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ పాటదారులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని భక్తులు ఆరోపణలు చేశారు. అదే విధంగా ఆలయంలో వివాహాలు చేసుకునే సామాన్యుల నుండి నిర్దేశించిన మొత్తం కాకుండా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఈవో పట్టించుకోలేదని ఆళ్లబుజ్జి ఆరోపించారు. కనీసం బోర్డులు కూడా పెట్టలేదన్నారు. గతంలో వివాహాలు ఆలయంలో జరిగేవని వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బాహ్యప్రాంగణంలో చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారని మంత్రి దృష్టికి భక్తులు తీసుకువెళ్లారు.

సప్తగోదావరి అభివృద్ధి పనుల్లో అవినీతి

అదే విధంగా సప్తగోదావరి అభివృద్ధి పనుల్లో కూడా అవినీతి చోటు చేసుకుందని ఉపాధి హామీ పథకంలో పనులు చేసి ప్రభుత్వం నుంచి కూడా నిధులు డ్రా చేశారని పలువురు ఆరోపించారు. మాజీ మంత్రి వేణు ఆలయానికి వస్తే భక్తులకు దర్శనాలు నిలిపివేశారని భక్తులు ఆరోపించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హయాంలో కూడా ఇలా జరగలేదన్నారు. దీనిపై మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఇక పై తనకు కూడా ప్రోటోకాల్ వద్దని సామన్య భక్తులకు దర్శనాలు కల్పించడమే ప్రధానమన్నారు. అదే విధంగా జనరేటర్ డీజిల్ సొంత వాహనాలకు వాడుకున్నారని, ఆలయ వసతి గృహాలు వాడుకున్నారని, ప్రసాదం పంపిణీ, పూల అలంకరణ, డ్రైఫ్రూట్స్ కొనుగోళ్లలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి వేణు అనుచరులు ఇద్దరు వలంటీర్లకు ఆలయంలో అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాలు కల్పించి రెండు చోట్లా వేతనాలు చెల్లిస్తున్నట్లు తేల్చారు. వీరిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. వీటిపై మంత్రి సుభాష్ మాట్లాడుతూ విజిలెన్స్ అధికారులు అన్నీ తేలుస్తారని ఆలయంలో కొంతమంది ఉద్యోగులు సస్పెండ్ అవుతారని అన్నారు.

ఆలయంలో భారీ అవినీతి: మంత్రి సుభాష్

భీమేశ్వరాలయంలో వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి వేణు హయాంలో భారీ అవినీతి చోటు చేసుకుందని మంత్రి సుభాష్ అన్నారు. బహిరంగ విచారణ అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. రథం తయారీలో లక్షలాది రూపాయలు వసూలు చేశారని తేలిందన్నారు. శిలా ఫలకాలు పెట్టి తొలగించడం సాక్ష్యాధారాలతో సహా దొరికాయన్నారు. ప్రోటోకాల్ పేరుతో భక్తులకు గంటలు గంటలు దర్శనం జరగకుండా చేశారన్నారు. జనరేటర్లు అమ్మేసుకున్నట్లు తేలిందన్నారు. మొత్తం వ్యవహారాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామన్నారు. టీడీపీ నాయకులు దొంగల శ్రీధర్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, చోడిశెట్టి శివాజీ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి సుభాష్ భీమేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సప్తగోదావరి, వసతి గృహాలను పరిశీలించారు.

చెత్తకుప్పల్లో ఆధార్ కార్డులు..పోస్టల్ నిర్లక్ష్యంపై విమర్శలు



చెత్త కుప్పల్లో కార్డులు

సర్పవరం జంక్షన్, జూన్ 26: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆధార్ కార్డు తప్పనిసరి. ఎలాంటి దరఖాస్తు చేయాలన్నా..ప్రభుత్వ తదితర పథకాలు అందాలన్నా ఇదే కీలకం. అంతటి ప్రాధాన్యత కలిగిన ఆధార్ కార్డులు కస్టమర్ల చేతికి బట్వాడా చేయాల్సిన పోస్టల్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెత్తకుప్పల్లో ఆధార్ కార్డులు దర్శనమివ్వడమే దానికి నిదర్శనం. చెత్తసేకరించేందుకు విచ్చేసిన పారిశుధ్య కార్మికుల కంట పడటంతో పోస్టల్‌శాఖ సిబ్బంది నిర్వాకం బయటపడింది. వివరాల్లోకెళితే కాకినాడ రూరల్ మండలం సర్పవరం మహారాష్ట్ర బ్యాంకు వీధిలో పోస్టాఫీసు బ్రాంచి కార్యాలయం ఉంది. ఆఫీసు బయట ఫైబర్ డస్ట్‌బిన్‌లో ఉన్న చెత్తా, వ్యర్థాలను సేకరించేందుకు బుధవారం ఉదయం సర్పవరం గ్రామ పంచాయతీకి చెందిన శానిటేషన్ వర్కర్లు వచ్చారు. డస్ట్‌బిన్‌లో ఉన్న వ్యర్థాలు బయటకు తీసి ట్రాక్టర్‌లోకి లోడ్ చేసే క్రమంలో అటుగా వెళుతోన్న స్థానికుడు ఎల్ఎస్ వీరభద్రరాజు గుర్తించి ఒరిజినల్ ఆధార్‌కార్డులుగా పరిశీలించి ఈ విషయాన్ని పోస్ట్‌మాస్టర్ సత్యనారాయణకు సమాచారం అందించారు. ఆయన తక్షణమే అక్కడకు వచ్చి ఆధార్‌కార్డులను పరిశీలించి, వెనక్కి తీసుకెళ్లి సంబంధిత కస్టమర్లకు పంపిణీ చేయించడంతో సమస్య సద్దుమణిగింది. ఈ విషయమై పోస్ట్‌మాస్టర్ సత్యనారాయణను వివరణ కోరగా రెండ్రోజుల కిందట తమ పోస్టాఫీసులో యాన్యువల్ ఇన్స్‌పెక్షన్ జరిగిందని, కార్యాలయం అంతా క్లీనింగ్ చేయించి, ఆధార్‌కార్డులు, ఇతర పత్రాలను ఒకచోట పెట్టగా పొరపాటున స్వీపర్ వీటిని తీసుకెళ్లి డస్ట్‌బిన్‌లో వేశారన్నారు. పోస్టల్ శాఖ అధికారులు,సిబ్బంది నిర్లక్ష్యవైఖరితో విలువైన ఆధార్‌కార్డులు చెత్తకుప్పలు పాలయితే తమ పరిస్థితి ఏంటని కస్టమర్లు ప్రశ్నించారు. పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాకినాడలో రెండు రోజులు
మంత్రి నాదెండ్ల పర్యటన



కాకినాడ సిటీ, జూన్ 26: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 28,29 తేదీల్లో కాకినాడలో పర్యటించనున్నారు. 28వతేదీ ఉదయం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, పౌరసరఫరాల సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరుపై సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ ద్వారా రేషన్‌బియ్యం పంపిణీని పరిశీలించనున్నారు. 29వతేదీ ఉదయం రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులు, కార్డుదారులతో సమావేశం జరపనున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో చేపట్టిన ధాన్యం సేకరణ, కనీస మద్దతు ధర చెల్లింపు తదితర అంశాలపై ఆయా శాఖల సంబంధిత అధికారులు, రైతులతో మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశం నిర్వహిస్తారు. ఈ మేరకు రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండియన్ సర్క్యులర్ జారీ చేశారు.

సెల్‌ఫోన్ల రికవరీ

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) సహాయంతో చోరీకి గురైన 13 సెల్‌ఫోన్లు రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందజేశామని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) సీఐ పి.విజయశంకర్ తెలిపారు. వాటి విలువ సుమారు రూ.1 లక్షా 35 వేలు ఉంటుందన్నారు. సీఈఐఆర్ ద్వారా ఇప్పటివరకూ మొత్తం 33 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. చోరీకి గురైన ఫోన్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉండగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాటిని రప్పించామన్నారు. ప్రయాణికులు సీఈఐఆర్ పోర్టల్ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ విజయ్‌శంకర్, ఎస్ఐలు మావుళ్లు, లోవరాజు సిబ్బందిని డీఎస్ఆర్పీ ఎల్.మోహనరావు అభినందించారు.

4 నుంచి మరిడమ్మ జాతర ఉత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

పెద్దాపురం, జూన్ 26: వచ్చే నెల 4 నుంచి ప్రారంభమయ్యే మరిడమ్మ జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో జె.సీతారామారావు కోరారు. పెద్దాపురం మరిడమ్మ దేవస్థానంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో జాతర నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని బుధవారం మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సుమారు 37 రోజులపాటు జరిగే ఈ జాతర మహోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

బావిలో బిహార్ వాసి మృతదేహం



శర్మ..ఫైల్‌ఫోటో



మృతదేహాన్ని వెలికితీస్తున్న సిబ్బంది

తుని రూరల్, జూన్ 26: కాకినాడ జిల్లా తుని పట్టణం రాణి సుబ్రద్రయమ్మ పేట వద్ద బావిలో మృతదేహం కలకలం రేపింది. బిహార్‌కి చెందిన ఉత్తంకుమార్ శర్మ(39)తునిలోని ఒక హోటల్‌లో వంట మేస్త్రిగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా అతను కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 10న తుని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా మిస్సయిన వ్యక్తి మృతదేహం బావిలో కనిపించింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని పైకి తీయించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శర్మకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యార్థుల నిజాయితీ

దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించిన వైనం




ఫోన్ అప్పగించిన విద్యార్థులు వీరే..

ఆత్రేయపురం, జూన్ 26: దొరికిన మొబైల్‌ను పోలీసులకు అప్పగించి ఐదుగురు విద్యార్థులు నిజాయితీ చాటుకున్నారు. బుధవారం ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులకు స్కూలు సమీపంలో మొబైల్ ఫోన్ దొరికింది. వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫోన్ ఎవరిదో తెలుసుకుని అప్పగించాలని అందించారు. విద్యార్థులను ఎస్ఐ శ్రీనివాస్ అభినందించారు. అనంతరం సెల్ పోగొట్టుకున్న ఇంటర్ విద్యార్థి ధనరాజుకు మొబైల్‌ను అప్పగించారు. నిజాయితీ చాటిన విద్యార్థులను పోలీసులు అభినందించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 'తిరుమల' ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్ జూన్26:రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లమెంటరీ ఫలితాల్లో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో గల తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 468 మార్కులను ఎం.ప్రియహాసిని, సీహెచ్ హాసిని, కె.షర్మిలసాయి సాధించారని, 466 మార్కులు పైన 76 మంది 465 మార్కులు పైన 231 మంది 463 పైన 693 మంది 460 పైన 1970 మంది సాధించారన్నారు. బైపీసీ విభాగంలో షేక్ ఫాతిమున్నీసా బేగం 440కి 438 మార్కులు, 437 మార్కులు ఎ.సింగ్, ఎన్.మణి, కేఎస్ హవీలా సాధించారని, 435పైన 39 మంది, 430 పైన 172 మంది, 400 పైన 332 మంది మార్కులు సాధించారన్నారు. 99.06 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తో కలిసి అభినందించారు.

ఆక్వాటెక్ చాంపియన్‌షిప్ వాటర్‌పోలోకి ఎంపిక



షణ్ముఖశ్రీసాయిని అభినందిస్తున్న దృశ్యం

కాకినాడ అర్బన్, జూన్ 26: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో వచ్చేనెల 7 నుంచి 11 వరకు జరిగే 50వ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ వాటర్‌పోలోకి కాకినాడకు చెందిన షణ్ముఖశ్రీసాయి ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం డీఎస్ఏ ప్రాంగణంలో ఆమెను అభినందించారు. డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్‌కు చెందిన సురేష్, ఐ.రాజు, కోచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీకి అడ్డంకులా'



చెక్‌పోస్టు వద్ద పోలీసుల బందోబస్తు

రాజవొమ్మంగి జూన్ 26: రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విజయోత్సవ ర్యాలీకి పోలీసులు అడ్డంకులు సృష్టించారని టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ స్వగ్రామం ఎల్లవరం వెళ్లకుండా అడ్డుకున్నారని చెప్పారు. చెక్‌పోస్టు ఏర్పాటు చేసి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా లేని ఆంక్షలు ఇక్కడేమిటని టీడీపీ నేతలు పోలీసుల వైఖరిపై మండిపడ్డారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి రావడంతో బుధవారం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. నియోజకవర్గమంతా సాఫీగానే విజయోత్సవ యాత్ర జరగ్గా అడ్డతీగల మండలంలోని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ స్వగ్రామమైన ఎల్లవరం గ్రామానికి మాత్రం విజయోత్సవ ర్యాలీ వెళ్లకుండా పాపంపేట జంక్షన్‌లో పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఏ వాహనాలను చెక్‌పోస్టు దాటి వెళ్లనీయలేదు. విజయోత్సవ ర్యాలీ బుధవారం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది షెడ్యూల్ విడుదల చేశారు. అలాగే వైసీపీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఎల్లవరం గ్రామంలోకి విజయోత్సవ ర్యాలీ వెళ్లనీయడం లేదని టీడీపీ నాయకులు తెలిపారు. కాగా అధికార పార్టీ ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీ ఉందని ముందస్తు సమాచారం ఇచ్చినా పోలీసులు వైసీపీ నేతల సమావేశాన్ని వాయిదా వేసుకునేలా ప్రయత్నాలు చేయకపోవడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. పోలీసులకు అనంత ఉదయభాస్కర్‌పై ఉన్న ప్రేమ ఇలా బయటపడిందని పలువురు అన్నారు.

ఆరుగురికి డయేరియా..ఆస్పత్రిలో చికిత్స



క్యాంపును పరిశీలిస్తున్న వైద్యాధికారి వెంకటేశ్వరరావు

రంగంపేట, జూన్ 26: రంగంపేట పీహెచ్‌సీ పరిధిలో గల రంగంపేట మండలం ఈలకొలను గ్రామం శివారు అచ్యుతాపురానికి చెందిన ఆరుగురికి కలుషిత తాగునీరు కారణంగా మంగళవారం రాత్రి విరోచనాలు అవ్వడంతో అస్వస్థతకు గురయ్యారని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేణుశ్రీలక్ష్మీ తెలిపారు. సంఘటన ప్రాంతానికి హుటాహుటిన సిబ్బందితో వెళ్లి వైద్యసేవలు అందించి, నివారణ చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా వాటర్‌ట్యాంక్ సంబంధిత అధికారులతో శుభ్రం చేయించి పైప్‌లైన్ వాటర్ లీకేజీలను సరిచేయించామన్నారు. జిల్లా వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు బుధవారం అచ్యుతాపురం గ్రామాన్ని సందర్శించి మెయిన్ ట్యాంక్ నుంచి తాగునీటి సరఫరా చేయాలని అర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, పంచాయతీ అధికారులకు సూచించారు. వైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఇంటింటా సర్వే నిర్వహించి నివారణ చర్యలు చేపట్టాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ప్రస్తుతం అచ్యుతాపురంలో పరిస్థితి అదుపుతో ఉందని జిల్లా వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయనతో పాటు రంగంపేట వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

'లక్ష్య సాధనకు కృషి చేయాలి'

ప్రత్తిపాడు, జూన్ 26: విద్యార్థులు తమ లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి కాటంబాను కోరారు. స్థానిక హైస్కూల్ సమీపంలో బీసీ బాలికల వసతిగృహాన్ని బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. బాలికల విద్యాప్రగతిపై ఆరా తీశారు. అలాగే ఆహార పదార్థాల నాణ్యతను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో విద్యాభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

రూ.200కోట్ల అవినీతికి పాల్పడిన వైసీపీ

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, జూన్ 26: చెరువుల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాల పేరుతో వైసీపీ నాయకులు రూ.200కోట్లు మేర అవినీతికి పాల్పడ్డారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రైతులు, పార్టీ నాయకులతో బుధవారం వర్మ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల ముసుగులో, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల పేరుతో అనుమతులు తెచ్చుకుని నియోజకవర్గంలో చెరువులను అడ్డగోలుగా తవ్వేశారన్నారు. ఇళ్లస్థలాలు ఎత్తు చేయకుండా మట్టిని అమ్ముకున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువుల్లో ఉన్న గర్భం, సిల్ట్ లెవిల్స్, ఎంతవరకూ తవ్వారు, అనుమతులు ఎవరు, ఎంతమేరకు ఇచ్చారు, తవ్వగా వచ్చిన మట్టి, గ్రావెల్‌ను ఎక్కడికి తరలించారు తదితర వివరాలను ఇరిగేషన్ అధికారులు అందజేయాలని ఆయన సూచించారు. ఈ వ్యవహారాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టిలో పెట్టి అవినీతిపై విచారణ జరిపించి, బాధ్యుల నుంచి అక్రమాలు జరిగిన మేర ప్రభుత్వం ద్వారా రికవరీ చేయిస్తామని తెలిపారు.

'సహాయ సహకారాలు అందించాలి'

కాకినాడ సిటీ, జూన్ 26: సీనియర్ సిటిజన్స్‌కు ఎదురయ్యే వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని, ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించాలని జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సగిలి షణ్మోహన్‌ను బుధవారం వారు కలిసి తమ సమస్యలపై వినతి సమర్పించారు. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించేలా ప్రాధాన్యమివ్వాలని, ఆర్టీసీ ప్రయాణంలో వృద్ధులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాకినాడ ఆర్డీవో, జిల్లా వికలాంగుల సంక్షేమాధికారిని కలిసి వినతులు సమర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీ.మూర్తి, ప్రధాన కార్యదర్శి ఆర్.సుధాకర్, కోశాధికారి రామ సుబ్బారావు, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

'సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి'

గొల్లప్రోలు, జూన్ 26: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును పునురుద్ధరించి, ఇతర పథకాలకు మళ్లించిన నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలని ఏఐఎఫ్‌టీయూ, ఏపీఆర్‌సీఎల్ జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు, వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని జగనన్న కాలనీలో బుధవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయరంగ సంక్షోభంతో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు ప్రత్యేకహోదా కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు డి.నారాయణమూర్తి, గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న, గొర్ల శివ, బొడ్డు వెంకటరమణ తదితరులున్నారు.

'విద్యార్థుల సంఖ్యను పెంచాలి'

కరప, జూన్ 26: ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో బుధవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వారు సమావేశమై విద్యాప్రవేశం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది, సీఆర్‌పీల సహకారంతో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలవాలన్నారు. జూలై 25వరకు విద్యాప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. సీఆర్‌పీలు పలక రాజు, పి.సత్యనారాయణ, పి.సునీత పాల్గొన్నారు.

'మట్టి నమూనాలతో భూసార పరీక్షలు'

గొల్లప్రోలు రూరల్, జూన్ 26: మనకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన మాదిరిగానే పంటపొలాల్లో భూసారాన్ని పరీక్షించేందుకు మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తామని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టరు జ్యోతిర్మయి తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం మట్టి నమూనా తీయడం, వాటిని విశ్లేషించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పెద్దాపురం ఎఫ్‌టీసీ, పిఠాపురం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు పి.మాధవి, పి.స్వాతి, వ్యవసాయాధికారులు సుధామాధురి, పద్మశ్రీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి'

సామర్లకోట, జూన్ 26: మండలంలో వేట్లపాలెంలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో డయేరియా వ్యాప్తి అధికంగా ఉన్నందున పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో శుచి, రుచి, నాణ్యతా ప్రమాణాలు పాటించే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ఎంఈవో పి.పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం వేట్లపాలెం కొండపల్లి గంగన్న మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే పాత్రలను పరిశీలించారు. నాడు-నేడు పనుల అమలు తీరును పరిశీలించి హెచ్ఎం అనూరాధకు తగు సూచనలు చేశారు.

'గ్రామాల్లో చెట్లను నాటాలి'

కుతుకుడుమిల్లి (కొత్తపల్లి), జూన్ 26: పర్యావరణ పరిరక్షణకు గ్రామాల్లో పచ్చని చెట్లను విరివిగా నాటాలని జనసేన నాయకుడు, స్వేచ్ఛ ఫౌండేషన్ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డి, కలవలదొడ్డి గ్రామాల్లో ఆయన బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అటవీ శాఖ ద్వారా గ్రామాలకు పంపిణీ చేసిన శ్రీగంధం, మామిడి, రంగూన్ టేకు మొక్కలను నాటారు. తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, సానా నాగు, మత్సా అప్పాజీ, గంధం నాగేంద్ర, కండిపల్లి నూకరాజు, మరిశెట్టి బుజ్జి, కుక్కల కుక్కల రామకృష్ణ పాల్గొన్నారు.

'పంటకాలువల్లో పూడికలు తొలగించాలి'

పిఠాపురం రూరల్, జూన్ 26: పంటకాలువల్లో పూడికలు తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పిఠాపురం మండలం పి.రాయవరం రైతులు, టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలేరు ఇరిగేషన్ అధికారులను బుధవారం కలిసి వారు వినతిపత్రం అందజేశారు. పంటపొలాలకు సాగునీరు అందించేందుకు కాలువల్లో ఎక్కడిక్కడ గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పొలాలకు సాగునీరు అందే పరిస్థితి లేదని చెప్పారు. సార్వా సాగుకు వీలుగా పూడిక తొలగింపు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని వారు కోరారు.

'ప్రజాధనం దుర్వినియోగం జరగకుండా చూడాలి'

గొల్లప్రోలు, జూన్ 26: ప్రజాధనం దుర్వినియోగం జరగకుండా చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు బుధవారం గొల్లప్రోలు నగరపంచాయతీ కమిషనరు రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరపంచాయతీ సమావేశం అజెండాల్లో 6 అంశాలు అవినీతికి ఆస్కారం ఇచ్చేవిగా ఉన్నాయని వారు తెలిపారు. రిపేర్లు, వివిధ పనులు పేరుతో లక్షలాది రూపాయిలు పెడుతున్నారని, అందులో వాస్తవికత ఉండలంలేదని చెప్పారు. ఈ విషయాన్ని తాము పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లతామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే పనికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

యనమల రామకృష్ణుడు పర్యటన

తుని రూరల్, జూన్ 26: శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు తునిలో పర్యటించారు. శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న తుని టీడీపీ పట్టణాధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే జనసేన నేత రాజా అశోక్‌బాబును ఆయన స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. అశోక్‌బాబుతో పట్టణాభివృద్ధి, పలు సమస్యలపై చర్చించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు యనమల రాజేష్, కొయ్యా శ్రీనుబాబు, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), మోతుకూరి వెంకటేష్, సిద్దాంతపు సత్తిబాబు,శ్రీనివాసరాజు ఉన్నారు.

యనమలను కలిసిన ఎమ్మెల్యే రాజప్ప

శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడును బుధవారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తేటగుంట టీడీపీ కార్యాలయంలో కలిశారు. పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు.

హోంమంత్రిని కలిసిన డాక్టర్ చప్పిడి



సర్పవరం జంక్షన్, జూన్ 26: రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు తీసుకుని పాయకరావుపేట విచ్చేసిన వంగలపూడి అనితను ఆ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు, రాష్ట్ర ఆరోగ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో మహిళల భద్రత, రక్షణ, హక్కుల కల్పనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

జనసేన మహిళా నాయకుల పూజలు

పిఠాపురం, జూన్ 26: పట్టణంలోని పాదగయ క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాల్లో జనసేన మహిళా నాయకులు, మహిళా స్ఫూర్తి టీమ్ సభ్యులు బుధవారం పూజలు నిర్వహించారు. శ్రీపాదవల్లభుని, కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లకు కుంకుమపూజలు చేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన వారాహి అమ్మవారి దీక్ష ఏ ఆటంకాలు లేకుండా పూర్తి కావాలని కోరుకుంటూ పూజలు చేశామని జనసేన గొల్లప్రోలు పట్టణ కమిటీ అధ్యక్షురాలు వినుకొండ శిరీష, నాయకులు అమ్మాజీ, కనకలక్ష్మి, నాగలక్ష్మి, సుధా ఆదిలక్ష్మి తెలిపారు.

డ్రగ్స్, మద్యానికి దూరంగా ఉందాం

» అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం » ర్యాలీలు, అవగాహన సదస్సులు



పిఠాపురంలో విద్యార్థుల ర్యాలీ, ప్రత్తిపాడులో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

పిఠాపురం, జూన్ 26: డ్రగ్స్, మద్యానికి దూరంగా ఉందామని పిలుపునిస్తూ పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో డ్రగ్స్ వద్దు, ఆరోగ్యం ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఉప్పాడ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జేవీవీ ప్రతినిధులు వి.సత్యనారాయణరెడ్డి, సూర్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డీవీ కాశీవిశ్వనాథం, వి.బుల్లిప్రసాద్, ఎస్ఈబీ సీఐ గురువయ్య, ఎస్ఐ సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్ ఏపీఎస్పీ బెటాలియన్ ఆవరణలో కాకినాడ 3 (ఏ) గరల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, అక్రమ రవాణాపై తీసుకోవాలన్సిన చర్యలపై వక్తలు వివరించారు. ఏపీఎస్పీ నుంచి సర్పవరం జంక్షన్, బోట్ క్లబ్ వరకు ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 3 ఆంధ్రా బెటాలియన్ సుబేదార్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రగతి జూనియర్ కళాశాల వద్ద ర్యాలీని ఎస్ఐ ఎం.పవన్ కుమార్, సెబ్ సీఐ ఎల్ చిరంజీవి ప్రారంభించారు. మాదకద్రవ్యాల పట్ల ప్రజలు దూరంగా ఉండాలని, విద్యార్థులు, సెబ్ అధికారులు, పోలీసులు, ప్రదర్శన నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు.

ఏలేశ్వరం: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు కోర్టు ప్యానల్ అడ్వకేట్ బుగతా శివ అన్నారు. ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల లీగల్ సర్వీస్ ఆథారిటీ ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్యదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్యానల్ అడ్వకేట్ అవసరాల దేవి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఉషా మాధురి, వీఆర్వో అవసరాల కిషోర్, మండల లీగల్ సర్వీస్ ఆథారిటీ శ్రీలక్ష్మీ ఉన్నారు.

తాళ్లరేవు: సమాజంలో మాదక ద్రవ్యాల నియంత్రణకు యువత నడుంబిగించి ప్రజల ఆరోగ్యాలను బాగుచేసేందుకు కృషిచేయాలని సెబ్ ఎస్ఐ టి.చిట్టిబాబు అన్నారు. సుంకరపాలెం రవిజూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ర్యాలీ చేశారు.ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరరావు ఉన్నారు.

తుని రూరల్: తుని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ఎస్‌బీ పోలీసులు ఎస్‌హెచ్‌వో పి.చిట్టిబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తుని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, జరిగే ప్రమాదాలపై వారు వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సిటీ ఎమ్మెల్యే కొండబాబు



ఎమ్మెల్యేను కలిసిన సీఐటీయూ నాయకులు

కాకినాడ సిటీ, జూన్ 26: వివిధ శాఖల మంత్రులు పూర్తిస్థాయిలో బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయా రంగాలవారీగా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి నేతృత్వంలో నాయకులు కొండబాబును బుధవారం ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె కోరారు. జీజీహెచ్, నగరపాలకసంస్థ వంటి ప్రభుత్వశాఖల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, వీవోఏ, మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల వేతనాలు, పదోన్నతులు, ఉద్యోగ భద్రతపై కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేయాలని విన్నవించుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, ఆశావర్కర్ల జిల్లా నాయకురాలు చంద్రమళ్ల పద్మ, పలు సంఘాల ప్రతినిధులు నర్ల ఈశ్వరి, టి.శ్రీనివాస్, జీ.సత్యనారాయణ, రమణమ్మ, భారతి, పద్మ పాల్గొన్నారు.

సాహు మహారాజ్‌కు నివాళి



కాకినాడలో సాహు మహారాజ్ చిత్రపటానికి నివాళి

కాకినాడ సిటీ, జూన్ 26: బడుగు బలహీన వర్గాల ప్రజలకు సమాజంలో సమాన హోదా ఉండాలని, అందరితో సమానంగా జీవించాలని దేశంలోనే మొదటిసారిగా తన రాజ్యంతో రిజర్వేషన్లు ప్రవేశపెట్టి మనమెంతమంది ఉన్నామో మనకంత వాటా కావాలనే విధానాన్ని అమలు చేసిన ఛత్రపతి సాహు మహారాజ్ చిరస్మరణీయుడని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడి చెంగల్‌రావు అన్నారు. ఛత్రపతి సాహు మహారాజ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం కాకినాడలోని బీఎస్పీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సుబ్బు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చంగల్‌రావు, జిల్లా ఇన్‌చార్జి సబ్బవరపు అప్పారావు, జిల్లా ఇన్‌చార్జి సాధనాల రాజు సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిటీ కన్వీనర్ ఆలీ బాష, రూరల్ కన్వీనర్ సుధాకర్, బీఎస్పీ నాయకులు చందు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో అంబేడ్కర్ విగ్రహం ఛత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఎస్పీ ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు, పులి ప్రసాద్, గొడుగు ఆంజనేయులు, సాదే నరేంద్రబాబు ఉన్నారు.

15 వరకు విద్యా జాగృతి ఉద్యమం

కాకినాడ సిటీ, జూన్ 26: విద్యకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) సంస్థ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యా జాగృతి ఉద్యమం జూలై 15 వరకు కొనసాగుతుందని సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు ఎండీ హలీమ్ తెలిపారు. రామకృష్ణారావుపేటలోని సంస్థ కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంలో మూడో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కలిపి చదివించే జీవో నెంబరు 117ను రద్దు చేయాలని కోరారు. విద్యా జాగృతి ఉద్యమం పోస్టర్‌ను సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. సమావేశంలో సంస్థ జిల్లా సభ్యులు కె.లలితాదేవి, సాహెర బేగం, అల్లా ఉద్దీన్, సిటీ అధ్యక్ష కార్యదర్శులు గౌస్ మొహిద్దీన్, ఎండీ అజహర్, ఉపాధ్యక్షుడు ఎండీ ఇబ్రహీం, సిటీ సభ్యులు బషీరా సుల్తానా, సిరాజుద్దీన్, అఖిల్ ఆలీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నాయకులపై కేసుల కొట్టివేత

ప్రత్తిపాడు, జూన్ 26: అంగన్‌వాడీ నాయకులపై సీడీపీవో పెట్టిన కేసులను ప్రత్తిపాడు న్యాయమూర్తి కాటంభాను కొట్టివేశారు. 2013లో శంఖవరం సీడీపీవో ఇమంది పార్వతి తన కార్యాలయంలో సమావేశాన్ని అడ్డుకున్నారని సభలో నిర్బంధించి విధులకు ఆటంక పరిచారని అప్పట్లో అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫిర్యాదు మేరకు అన్నవరం పోలీసులు అంగన్‌వాడీ నాయకురాళ్లు కాకరపల్లి సునీత, మండిపూడి వీరలక్ష్మి, ఆకుల అప్పలనర్స, ఇమంది వేమేశ్వరిపై కేసులు నమోదు చేశారు. 11 ఏళ్ల పాటు కొనసాగిన ఈ కేసు విచారణ అనంతరం బుధవారం న్యాయమూర్తి కాటంభాను సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసులు కొట్టివేసినట్టు తీర్పు ఇచ్చారు. కేసును అంగన్‌వాడీల తరువాత బిలాజ్ సభ్యులు బుగతా శివ, అవసరాల దేవి వాదించగా అంగన్‌వాడీలు హర్షం వెలిబుచ్చారు.

బిల్లుల పేరుతో అధికారుల మాయాజాలం

గొల్లప్రోలులో కౌన్సిలర్ల ఆగ్రహం



సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

గొల్లప్రోలు, జూన్ 26: బిల్లుల పేరుతో అధికారులు మాయాజాలం చేస్తున్నారని, చేసిన పనులకు మళ్లీ మళ్లీ నిధులు అడుగుతూ లక్షలాది రూపాయిల ప్రజలు నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఛైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు అజెండాలోని పలు అంశాలపై అభ్యంతరం తెలిపారు. 6 అంశాలను తిరస్కరిస్తున్నట్టు తెలిపారు. అయితే మెజార్టీ కౌన్సిలర్లు వ్యతిరేకించినా వీటిని ఆమోదించినట్లు తర్వాత మినిట్స్‌లో నమోదు చేశారని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా విగ్రహాలకు ముసుగు వేసినందుకు లక్ష రూపాయిలు నిధులు అవసరమవుతాయని, ర్యాటిఫికేషన్ చేసిన అంశంపై సభ్యులు మండిపడ్డారు. వాస్తవంగా రూ.35వేలుకు మించి అవ్వదని, దానికి లక్ష ఎలా పెట్టారని కౌన్సిలరు గంటా అప్పలస్వామి ప్రశ్నించారు. మోటార్ రిపేర్ నిమిత్తం రూ.1.50లక్షలను అసిస్టెంట్ ఇంజనీర్‌కు అడ్వాన్స్ చెల్లింపు అంశంపై కౌన్సిలర్లు ప్రశ్నించారు. పట్టణంలో వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని వైస్‌చైర్మన్ తెడ్లపు అలేఖ్యరాణి, కౌన్సిలర్లు మొగలి దొరబాబు, గుళ్ల సుబ్బారావు, గంటా అప్పలస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్రిక్తత

నగరపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉద్రిక్తత ఏర్పడింది. సమావేశం జరుగుతున్న సమయంలో పలువురు వైసీపీ కార్యకర్తలు, నాయకులు నగరపంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తర్వాత టీడీపీ, జనసేన నాయకులు అక్కడకు చేరుకోవడంతో ఏమి జరుగుతుందన్న ఉత్కంఠ ఏర్పడింది. అక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే సత్యప్రభకు అపూర్వ స్వాగతం



ప్రత్తిపాడులో ర్యాలీగా వస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు/ఏలేశ్వరం/రౌతులపూడి, జూన్ 26: అసెంబ్లీలో ఎమ్మె ల్యేగా పదవీ ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా బుధవారం నియోజకవర్గానికి విచ్చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాకు నియోజక వర్గ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ప్రత్తిపాడు, జగ్గంపేట జాతీయ రహదారిపై యర్రవరం సెంటర్‌కు చేరుకున్న సత్యప్రభకు ప్రజలు పూల వర్షం కురిపించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యో తుల నవీన్‌కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల వీరాస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌వరుపుల తమ్మయ్యబాబు తదితర నాయకులు సత్యప్రభకు అభినందనలు తెలిపారు. యర్రవరం నుంచి సత్యప్రభ విజయోత్సవ ర్యాలీ ఏలేశ్వరం మండల గ్రామాల మీదుగా రాత్రి ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి గ్రామానికి చేరుకుంది. చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ, ఉత్తరకంచి,ఒమ్మంగి,రాచపల్లి మీదుగా ప్రత్తిపాడు వరకు ర్యాలీ కొనసాగింది. ప్రత్తిపాడులో దివంగత టీడీపీ నేత వరుపుల రాజా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యప్రభ మాట్లాడుతూ తన భర్త దివంగత నేత టీడీపీ నేత వరుపుల రాజా ఆశయ సాధన కోసం నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు వత్సవాయి సూర్యనారాయణరాజు, కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, వెన్నా శివ, బసవా ప్రసాద్, బద్ది రామారావు, ఉల్లి వీరభద్రరావు, అమరాది వెంకట్రావు, పల్లా గోపి, బదిరెడ్డి గోపి, బుద్దరాజు గోపిరాజు, సర్పంచ్‌లు మంతెన శ్రీను, పంచాది మణికుమారి దొరబాబు, సూర్నీడి నాగరత్నం సురేష్, నాయకులు మిరియాల శ్రీను, గొంతిన సురేష్, యాళ్ళ జగదీష్, వెలుగుల నాని, కొప్పన సీతారాముడు,ఇళ్ళ అప్పారావు, దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, దంతులూరి బోస్ ఉన్నారు. ఏలేశ్వరం, రౌతులపూడి మండలాల నాయకులు,కార్యకర్తలు సత్యప్రభకు స్వాగతం పలికారు.

వీధిలైట్ల ఏర్పాటు

సామర్లకోట, జూన్ 26: మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో ప్రజలు ఎన్ని దఫాలు పంచాయతీ అధికారులు, మండల అధికారులకు మొర పెట్టుకున్న అంధకార సమస్యను ఏ మాత్రం పరిష్కరించలేకపోయారు. ఇటీవల టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దృష్టికి వీధిలైట్ల సమస్యను గ్రామ టీడీపీ నాయకుడు చల్లా బుజ్జి తదితరులు తీసుకువెళ్లడంతో మండల అధికారులతో చర్చించి వీధిలైట్లను వెలిగించాల్సిందిగా ఆదేశించారు. దీంతో బుధవారం నాటికి గ్రామంలో 60 శాతం ఎల్ఈడీ వీధి లైట్లను ఏర్పాటు చేసి వెలిగించే పనులను పంచాయతీ అధికారులు ముమ్మరం చేశారు.

అధ్వానంగా పారిశుధ్యం!



రౌతులపూడి యాదవ కాలనీలో మంచినీటి బోరు వద్ద మురికినీరు

రౌతులపూడి, జూన్ 26: రౌతులపూడిలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు కనిపి స్తున్నాయి. డ్రైనేజీల్లో మురికినీరు నిల్వఉంది. ఇప్పటికే జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో డయేరియా విజృంభిచండంతో రౌతులపూడిలో డయేరియా వచ్చే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతు న్నారు. రౌతులపూడిలో హైస్కూల్‌కు వెళ్లే రహదారిలో పబ్లిక్ కుళాయిలో మురికి నీరు వస్తోంది. యాదవ కాలనీలో తాగునీటి బోరు వద్దే మురికి నీరు ఉంది. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గండేపల్లి: మండలంలో డయేరియా కేసులు పెరగడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వైద్యాధికారుల నిర్లక్ష్యంతో సేవలందడంలేదని వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆరోపిస్తున్నారు.

కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి

తాళ్లరేవు పంచాయతీ అధికారి భైరవమూర్తి

తాళ్లరేవు, జూన్ 26: గ్రామాల్లో ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని మండల పంచాయతీ అధికారి ఎమ్.భైరవమూర్తి సూచించారు. బుధవారం తాళ్లరేవు మాధవరాయునిపేటలో తాగునీరు తాగడంపై ప్రజలకు వివరించారు. తాగునీటిని ప్రజల ముందు పరీక్షించి చూపించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరు నీటిని కాచుకుని చల్లారిన తరువాత తాగితే ఎటువంటి అనారోగ్యం దరిచేరదని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ శంకరనారాయణ, హెల్త్‌సూపర్‌వైజర్ బొడ్డు కుమార్, కాలా ఆంజనేయులు, సచివాలయ సెక్రటరీ వేణుగోపాల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రమణకుమార్, హెల్త్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

'డయేరియాతో అప్రమత్తంగా ఉండాలి'

కిర్లంపూడి, జూన్ 26: గ్రామాల్లో ప్రజలంతా డయేరియాతో అప్రమత్తంగా ఉండాలని కిర్లంపూడి ఎంపీడీవో రాజేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల తాగునీరు, పరిసరాలు పరిశుభ్రత వంటి జాగ్రత్తలు తీసుకోవాలని, పంచాయతీ అధికారులు తాగునీరు శుద్ధిచేసి ప్రజలకందించాలన్నారు.

ఉప్పలంకలో ముంపునీరు తరలింపు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



ముంపు నీటిని మోటార్లతో బయటకు తోడుతున్న దృశ్యం

కరప, జూన్ 26: ఉప్పలంకలో అపారిశుధ్యం తాండవం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక కొత్తకాలనీలో 3 రోజులుగా ముంపు సమస్య ఉండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో కొంకి అప్పారావు ముంపు సమస్యను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సర్పంచ్ బొమ్మిడి నయోమి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మానస పర్యవేక్షణలో మోటార్లు పెట్టి ముంపు నీటిని బయటకు తోడించారు. బ్లీచింగ్ చల్లించి శానిటేషన్ చేయించారు. ముంపు సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతి పత్రికకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే నెహ్రూకు సత్కారం



జగ్గంపేట, జూన్ 26: స్థానిక రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు జగ్గంపేట డివిజన్ ఓసీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు జె.వీరేంద్ర, సెక్రటరీ బీహెచ్ ఆంజనేయులురాజు, బీవీ రమణ, పీఎస్ రాజు, సభ్యులు పాల్గొన్నారు. నెహ్రూను కృష్ణవరం టోల్ ప్లాజా మేనేజర్ సురేష్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్ మూర్తి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టోల్‌ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఆళ్ళ శివబాబు, చినబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చినరాజప్పకు అభినందన



సామర్లకోట, జూన్ 26: పెద్దాపురం ఎమ్మెల్యేగా మూడోసారి గెలుపొందిన నిమ్మకాయల చినరాజప్పను బుధవారం పట్టణ ఆటో డ్రైవర్లు, ఓనర్ల సంఘాలు సత్కరించి అభినందించారు. అచ్చంపేటలోని ఎమ్మెల్యే చినరాజప్ప స్వగృహానికి తరలివెళ్లి పూలమాలలతో ముంచెత్తారు. అలాగే జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబును మర్యాదపూర్వకంగా కలిసి కూటమి విజయానికి కృషిచేసినందున అభినందించారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

తొండంగి, జూన్ 26: యల్లయ్యపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్ చొక్కా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులను పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించి చిన్నారులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లిని కలిసిన హెల్త్ సిబ్బంది

కిర్లంపూడి, జూన్ 26: మండలంలోని రామచంద్రపురంలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌ను ఆరోగ్య సిబ్బంది కలిశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లాలో డయేరియా కేసులు నమోదవుతున్న దృష్ట్యా డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థినుల ర్యాలీ

గొల్లప్రోలు, జూన్ 26: నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు కలిగిన పిల్లలు అందరూ పాఠశాలల్లో చేరాలని కోరారు.

పుస్తకాల అందజేత

పెద్దాపురం, జూన్ 26: స్థానిక శాఖా గ్రంథాలయానికి బుధవారం పట్టణానికి చెందిన వ్యాపారవేత్త జిగిని రాజేష్ కన్నా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేసినట్టు గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు.